క్లుప్తంగా

సునీల్‌కు డాక్టరేట్



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని వినూత్న కళాశాల డైరెక్టర్ కె.సునీల్ కుమార్‌కు వరంగల్‌లోని నిట్ డాక్టరేట్ ప్రదానం చేసింది. 'డెవలప్‌మెంట్ ఆఫ్ నోవెల్ రోబస్ట్ స్పీచ్ బ్యాండ్విడ్త్ ఎక్స్‌టెన్షన్ టెక్నిక్' అనే అంశంపై ప్రొఫెసర్ కిషోర్‌కుమార్ పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సునీల్‌కుమార్ డాక్టరేట్ అందుకున్నారు. ఈమేరకు ఆయనకు వినూత్న కళాశాల కార్యదర్శి డాక్టర్ కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శి జి.రవీందర్‌రావు అభినందనలు తెలిపారు.

కేఎంసీకి పార్థివ దేహం అప్పగింత

ఎంజీఎం: కేఎంసీ వైద్య విద్యార్థుల విద్య నిమిత్తం పార్థివ దేహాన్ని గురువారం అప్పగించినట్లు నేత్ర అవయవ, శరీర దాతల అసోసియేషన్ అధ్యక్షుడు కొంద్రు మల్లారెడ్డి తెలిపారు. హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని సహృదయ వృద్ధాశ్రమం వాసి జగదాంబ(85) అనారోగ్య సమస్యలతో మృతి చెందగా, నిర్వాహకులు చోటు, యాకుబీ సహకారంతో జగదాంబ పార్థివ దేహాన్ని అనాటమీ విభాగానికి అప్పగించినట్లు మల్లారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఉపేందర్ రెడ్డి, రాజమౌళి, శంకర్‌రావు, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం



కాశిబుగ్గ: వరంగల్ 35వ డివిజన్ ఏసీరెడ్డినగర్‌కు చెందిన కంద్రాతి రాజు (36) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబం కడు పేదరికంలో ఉందని తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్.. మృతుడి వివరాలను ఎమ్మెల్యే నరేందర్ దృష్టికి తీసుకెళ్లారు. దహన సంస్కారాలకు రూ.10 వేలను అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని కార్పొరేటర్ భరోసా ఇచ్చారు.

ఆ ఎస్సైని విధుల్లోంచి తొలగించాలి

న్యూశాయంపేట: ఈనెల 9న ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ముస్లిం విద్యార్థినిపై అమానుషంగా ప్రవర్తించిన జగిత్యాల రూరల్ ఎస్సై అనిల్‌ను విధుల్లోంచి తొలగించి కేసు నమోదు చేయాలని తెలంగాణ ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ తాజొద్దీన్ డిమాండ్ చేశారు. హనుమకొండలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు మహమూద్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికురాలికి పర్సు అప్పగింత

హన్మకొండ: బస్సులో పోగొట్టుకున్న పర్సును ప్రయాణికురాలికి ఆర్టీసీ అధికారులు తిరిగి అందించారు. తిమ్మంపేట గ్రామానికి చెందిన సంగతి రజిత.. నర్సంపేట డిపోకు చెందిన బస్సులో నర్సంపేట నుంచి వరంగల్‌కు ప్రయాణిస్తూ బస్సులోనే పర్సు పోగొట్టుకుంది. అనంతరం బాధితురాలు నర్సంపేట కంట్రోలర్ ఈశ్వర్‌కు ఫిర్యాదు చేయగా పర్సును అధికారులు స్వాధీనం చేసుకుని ఆర్టీసీ వరంగల్ -1 డిపో మేనేజర్ పి.శ్రీనివాస్ చేతుల మీదుగా బాధిత ప్రయాణికురాలి కుటుంబ సభ్యులకు గురువారం అందించారు.

సుదర్శన్‌కు స్టాండర్డ్స్ సర్టిఫికెట్



ఖిలా వరంగల్: బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) న్యూఢిల్లీ ప్రధాన కార్యాలయంలో రెండు రోజుల పాటు జరిగిన స్టాండర్డ్ ఆఫ్ కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ప్రోగ్రాం సమావేశంలో బీఐఎస్ స్టాండర్డ్స్ సర్టిఫికెట్‌ను సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్ అందుకున్నాడు. 31ఏళ్లుగా వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ప్రజాప్రయోజన ఫిర్యాదులు, సాధించిన విజయాల ఆధారంగా సుదర్శన్‌కు సర్టిఫికెట్‌ను న్యూఢిల్లీ ప్రతినిధులు అందజేశారు. సీసీఐ జాతీయ నేతలు డాక్టర్ అనంత్ శర్మ, డాక్టర్ అరుణ్‌కుమార్, దేవేంద్ర తివారి, తెలంగాణ ప్రతినిధులు సాంబరాజు చక్రపాణి, పల్లెపాడు దామోదర్ పాల్గొన్నారు.

నేత్రాలను అశ్రద్ధ చేయొద్దు

హన్మకొండ చౌరస్తా: సర్వేంద్రియానం నయనం ప్రధానం అని, అందుకే నేత్రాలను అశ్రద్ధ చేయొద్దని హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్ అన్నారు. హనుమకొండలోని జిల్లా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధపడుతున్న అభ్యర్థులకు శరత్ మ్యాక్స్‌విజన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అజీజ్‌ఖాన్ మాట్లాడుతూ అభ్యర్థులకు కావాల్సిన పుస్తకాలు, వసతులను కల్పించడమే కాకుండా వైద్య శిబిరాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

యథేచ్ఛగా దోపిడీ

- నిండా మునుగుతున్న రైతులు
- క్వింటా ధాన్యంలో సొసైటీ, ఐకేపీలు 8, మిల్లర్లు 5కిలోల చొప్పున కోత
- దృష్టి సారించని అధికారులు



కొనుగోలు కేంద్రంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న ధాన్యం

హసన్‌పర్తి: ధాన్యం కొనుగోళ్లల్లో దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. క్వింటా ధాన్యం తూకం వేస్తే అందులో 13 కిలోల మేర కోత విధిస్తున్నారు. వివిధ కారణాలతో కింటా ధాన్యంలో సొసైటీ, ఐకేపీలు 8కిలోలు, మిల్లర్లు 5కిలోల చొప్పున కోత విధిస్తున్నారు. దాంతో రైతులు నిండా మునుగుతున్నారు.

తరుగు పేరుతో కొర్రీలు

వంగపహాడ్‌లోని వ్యవసాయ సహకార సంఘం తన పరిధిలోని రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసి, ఆ ధాన్యాన్ని నగరంలోని సూర్య, ధనలక్ష్మి రైస్‌మిల్లులకు తరలిస్తోంది. కాంటా వేసి ధాన్యం మిల్లుకు పంపితే అక్కడ మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారని అన్నదాతలు చెబుతున్నారు. క్వింటాకు ఐదు కిలోల చొప్పున కోత విధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలో మిల్లర్లను ప్రశ్నిస్తే తాలు, ధాన్యం తడిసిందని పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని తెలిపారు. ప్రశ్నించిన వారి ధాన్యాన్ని కొనుగోలు చేయబోమని రైస్ మిల్లుల నిర్వాహకులు తెగేసి చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల మోసం

అలాగే, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కూడా మోసం చేస్తున్నారని రైతులు ఆరోపించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం బస్తాకు 40కిలోలు తూకం వేయాల్సి ఉండగా, నాణ్యత పేరుతో 44కిలోల నుంచి 45కిలోల వరకు తూకం వేస్తున్నట్లు అన్నదాతలు చెబుతున్నారు. ఇక్కడ బస్తాకు 3 - 4కిలోల వరకు తరుగు తీస్తున్నారని తెలిపారు. ఇందేటని ప్రశ్నిస్తే ధాన్యం ఆరబెట్టుకుని రావాలని సమాధానం చెబుతున్నారని వాపోతున్నారు.

అందని రవాణా చార్జీలు

అయితే, కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లుకు తీసుకెళ్లిన ధాన్యం రవాణా చార్జీలు కూడా ఇవ్వడం లేదని రైతులు చెబుతున్నారు. గతేడాది కూడా మిల్లుకు ధాన్యం తీసుకెళ్లినా ఇంత వరకు డబ్బులు రాలేదని వారు వాపోయారు.

ఎమ్మెల్యేకు ఫిర్యాదు

ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు రైతులు ఫిర్యాదు చేశారు. ఇటు సొసైటీలు, అటు మిల్లర్లు తమను దోపిడీ చేస్తున్నారని అన్నదాతలు చెప్పారు. కాగా, ధాన్యం కొనుగోలులో జరుగుతున్న దోపిడీపై ఎమ్మెల్యే రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు అదనపు జాయింట్ కలెక్టర్ సంధ్యారాణి, డీసీఓ నాగేశ్వర్‌రావులతో ఫోన్‌లో మాట్లాడారు. తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ, నాణ్యమైన ధాన్యం తీసుకెళ్లినా తరుగు పేరిట ఎందుకు కోత విధిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. రైస్‌మిల్లుల వద్ద నియమించబడిన అధికారులు ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన సౌకర్యాలు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చీఫ్‌విప్, తదితరులు

హన్మకొండ అర్బన్: ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన చదువుతో పాటు మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. నగరంలోని వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలలో 2023 -2024 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలకే విద్యార్థులు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పింగిళి కళాశాలను కార్పొరేట్ కళాశాలగా ప్రభుత్వం తీర్చిదిద్ది, నిపుణులైన అధ్యాపకులతో బోధన అందిస్తున్నట్లు తెలిపారు. పింగిళి కళాశాలలో సాంప్రదాయకమైన డిగ్రీ కోర్సులతో పాటు, ఉపాధి కల్పన కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రిన్సిపాల్ చంద్రమౌళి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు పరిశోధన, సామాజిక సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, క్రీడలు, వివిధ పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, ఎగ్జామినేషన్ కంట్రోలర్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, అకాడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ పార్వతి, అడిషనల్ కంట్రోలర్లు రేణుక, శిరీష, లైబ్రరీ ఇన్‌చార్జ్ జగదీష్ పాల్గొన్నారు.

మెరుగైన తపాలా సేవలు అందించాలి



అనురాగ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నంద

హన్మకొండ: ప్రజలకు మెరుగైన తపాలా సేవలు అందించాలని పోస్టల్ సర్వీస్ బోర్డు మెంబర్ (ఆపరేషన్) ఐంద్రీ అనురాగ్ అన్నారు. కాజీపేటలోని నోడల్ పోస్టల్ డెలివరీ సెంటర్‌ను గురువారం పరిశీలించారు. ఈమేరకు అనురాగ్‌కు తపాలా శాఖ హనుమకొండ డివిజన్ సూపరింటెండెంట్ బానోతు నంద పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం నోడల్ పోస్టల్ డెలివరీ సెంటర్‌ను అనురాగ్ పరిశీలించి మాట్లాడారు. బట్వాడలో మరింత వేగం పెంచాలని సూచించారు. సత్వర పోస్టల్ సేవలు అందించేందుకు నోడల్ పోస్టల్ డెవివరీ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రజలు పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

21న అస్త్ర ఆన్‌లైన్ స్కాలర్‌షిప్ పరీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్

నయీంనగర్: మెరికల్లాంటి సివిల్ సర్వీస్ ఆశావహులను ఎంపిక చేయడానికి ఈనెల 21న ఆన్‌లైన్ పోటీ పరీక్ష నిర్వహించనున్నట్లు హైదరాబాద్‌కు చెందిన అస్త్ర ఎనలాగ్ ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపక సంచాలకులు శ్రీకాంత్ విన్నకోట తెలిపారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి అగ్రగణ్యులుగా నిలిచిన వారికి వందశాతం రాయితీని ప్రకటించారు. రెండు రాష్ట్రాల్లోని 67 జిల్లాల్లో అత్యధిక శాతం మార్కులు సాధించిన తొలి మూడు స్థానాల్లో నిలిచేవారికి భారీ ఉపకార వేతనాలుంటాయని చెప్పారు. వివరాలకు 84949 90066 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కట్టయ్య ఆశయ సాధనకు పాటుపడాలి



కట్టయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రకాశ్

కరీమాబాద్: దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు ఉద్యమించిన బొమ్మల కట్టయ్య ఆశయ సాధనకు ప్రతీఒక్కరు పాటుపడాలని శాసనమండలి డిప్యూటీ వైస్ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ అన్నారు. కరీమాబాద్‌లోని అంబేద్కర్ భవన్‌లో అంబేద్కర్ యువజన సంఘం, భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో దళితరత్న, అంబేద్కర్ వాది, బౌద్ధిస్టు ఉపాసక బొమ్మల కట్టయ్య రెండవ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బొమ్మల అంబేద్కర్ అధ్యక్షత వహించగా బండా ప్రకాశ్, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరై మాట్లాడారు. నగరంలో కట్టయ్య కాంస్య విగ్రహం ఏర్పాటు, గౌతమ బుద్ధుడి ఆలయ నిర్మాణం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి, రిటైర్డ్ సీపీ కేఆర్.నాగరాజు, నాయకులు ఎల్లయ్య, మహేందర్, రాజమణి, మల్లేశం, రాజు, రమేష్, సురేందర్, మహమ్మద్, రవి, రాంచందర్, రాజేందర్, బాబురావు, గౌతం, రవితేజ, ప్రభాకర్, శివమూర్తి, రాములు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థికి చీఫ్‌విప్ అభినందన



లక్ష్మీప్రసన్నకు స్వీట్ తినిపిస్తున్న చీఫ్‌విప్

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడికి చెందిన బైరపాక లక్ష్మీ ప్రసన్న పదవ తరగతిలో 10జీపీఏ సాధించగా, ఆమెను ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ గురువారం అభినందించారు. మున్సిపాలిటీలో పీహెచ్ వర్కర్‌గా పనిచేస్తున్న విద్యార్థిని తండ్రి బైరపాక సతీష్‌ను మెచ్చుకొని లక్ష్మీప్రసన్నను ఉన్నత చదువులు చదివించాలని సూచించారు.

విద్యార్థిని హమ్సికకు సన్మానం



అభినందిస్తున్న ప్రిన్సిపాల్, కరస్పాండెంట్

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని వందన హైస్కూల్‌కు చెందిన విద్యార్థి జి.హమ్సిక.. పదోతరగతి పరీక్షల్లో 10జీపీఏ సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచింది. ఈమేరకు హైస్కూల్ ఆవరణలో హమ్సికను ప్రిన్సిపాల్ ఆడెపు శ్యాసుందర్ (శ్యామ్), కరస్పాండెంట్ ఆడెపు విజయకుమారి, ఉపాధ్యాయులు దేవి, సరళ, రాజేందర్‌రెడ్డి గురువారం అభినందించారు.

జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలి



సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న పెండెం రాజు

విద్యారణ్యపురి: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను (జేపీఎస్) రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, జనరల్ సెక్రటరీలు ఎం.సదాశివరెడ్డి, పెండెం రాజు, తాటికాయల కుమార్, బద్దం వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు 14 రోజులుగా హనుమకొండలోని ఏకశిల పార్కు వద్ద సమ్మె చేస్తున్న జేపీఎస్‌ల శిబిరాన్ని గురువారం వారు సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. జేపీఎస్‌ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని సూచించారు. సంఘీభావం తెలిపిన వారిలో టీఎస్‌యూటీఎఫ్ బాధ్యులు సీహెచ్.రవీందర్‌రాజు, సుజన్‌ప్రసాద్‌రావు, వెంకటేశ్వర్‌రావు, ఎంఏ రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

అందరిని గౌరవించే వారు యాదవులు



సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్యయాదవ్

హన్మకొండ: అందరిని గౌరవించే వారు యాదవులు అని అఖిల భారత యాదవ మహాసభ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గిరబోయిన రాజయ్య యాదవ్ అన్నారు. అలాంటి వారిపై నోరు జారడం సరికాదని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. హనుమకొండ బ్యాంకు కాలనీలోని కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజు యాదవ్ స్వగృహంలో అఖిల భారత యాదవ మహాసభ ముఖ్య నాయకుల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా రాజయ్య యాదవ్ మాట్లాడుతూ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రాజకీయాల్లో విమర్శలు హుందాగా ఉండాలని సూచించారు. మంత్రికి, యాదవ సమాజానికి రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, ఆశలపల్లి సర్పంచ్ కిశోర్ యాదవ్, జనగామ జిల్లా అధ్యక్షుడు సిద్ధిరాజ్ యాదవ్, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లావుల కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న స్నేహలత

ఖిలా వరంగల్: ప్రజల భాగస్వామ్యంలోనే పారిశుద్ధ్యం మెరుగవుతుందని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ స్నేహలత అన్నారు. వరంగల్ శంభునిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్వచ్ఛ వరంగల్ పౌర సంఘాల వేదిక ఆధ్వర్యంలో స్వచ్ఛ పౌర సంఘాల వేదిక కన్వీనర్ పుల్లూరు సుధాకర్ అధ్యక్షతన కాలనీలు, అపార్ట్‌మెంట్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణకు ప్రజల మద్దతు తప్పనిసరి అని అన్నారు. అనంతరం మారి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.మురళి, ప్రముఖ కవి, గాయకుడు వల్లంపట్ల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు, మహిళలు స్వచ్ఛ వరంగల్ నగరాన్ని పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దడానికి ఒక ఉద్యమాన్ని నిర్మించనున్నట్లు వివరించారు. సమావేశంలో మల్లారెడ్డి, పరశురాములు, కర్నె రవీందర్, ఉల్ఫత్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరించాలి



కేయూ రెండోగేట్ వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని కుక్టా జేఏసీ, కుక్టా సంయుక్త ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ రెండో గేట్‌వద్ద అసిస్టెంట్ ప్రొఫెసర్లు గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా కుక్టా జేఏసీ చైర్మన్ డాక్టర్ కరుణాకర్ రావు, కుక్టా అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్ మాట్లాడుతూ తెలంగాణలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్ కళాశాలల్లోని కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసినట్లుగానే 12 యూనివర్సిటీల్లో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను కూడా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భిక్షపతి, మాదాసి కనకయ్య, అరూరి సూర్యం, సాధు రాజేష్, సతీష్, సాంబశివరావు, రమేష్, లక్ష్మారెడ్డి, ఉషారాణి, సునీత, శ్రీదేవి, రమాదేవి, సత్య జాల, చందులాల్, సుజాత, సంగీత్‌కుమార్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

నిరుపేదల ఆరోగ్యానికి ప్రాధాన్యం

హన్మకొండ: నిరుపేదల ఆరోగ్యానికి సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో 35మంది లబ్ధిదారులకు రూ.29,19,300 విలువ గల సీఎం సహాయనిధి చెక్కులను గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదల వివరాలను తమ దృష్టికి తీసుకువస్తే వారికి అండగా ఉంటూ ఆదుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో రక్తదాన శిబిరం



హన్మకొండ కల్చరల్: హనుమకొండ ఏషియన్ మాల్ సమీపంలోని సాయిబాబా మందిరంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మందిరం ధర్మకర్త నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంజీఎం ఆస్పత్రిలో తీవ్ర రక్త కొరత దృష్ట్యా ఎంజీఎం బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి భక్తుల నుంచి 38 యూనిట్ల రక్తం సేకరించినట్లు వివరించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు రాకం సదానందం, డాక్టర్ పూస సురేష్‌కుమార్, డాక్టర్ ఆశ, బ్లడ్ మోటివేటర్ కల్యాణి, సాగంటి మంజుల, రాజ్‌కుమార్, దేవునూరి ఆనంద్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు

హన్మకొండ కల్చరల్: వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రి సమీపంలోని గణేశ సుబ్రహ్మణ్య సహిత రాజరాజేశ్వరి దేవి దేవాలయంలో జరుగుతున్న వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా చివరిరోజు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం ఆలయ అర్చకుడు ఝెల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో సుబ్రహ్మణేశ్వర స్వామికి 52 లీటర్ల ఆవుపాలతో అభిషేకం, అర్చనలు జరిపించారు. అమ్మవారిని పూలమాలలతో శోభాయమానంగా అలంకరించి మహా హారతి ఇచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని లలితా సహస్ర నామ పారాయణం చేశారు.

ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి..

హన్మకొండ: ప్రజాసేవ చేసేందుకు తాను రాజకీయాల్లోకి వచ్చానని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి అన్నారు. తన పుట్టిన రోజు వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య గురువారం జరుపుకున్నారు. వడ్డెపల్లి ఎస్సీ కాలనీ, సమ్మయ్యనగర్, పోచమ్మకుంట, దీన్‌దయాల్ నగర్, కాకతీయ కాలనీల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి

హసన్‌పర్తి: అర్హులైన ప్రతీఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని కార్పొరేటర్ దివ్యారాణి తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 65వ డివిజన్ దేవన్నపేటలో కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆత్మ డైరెక్టర్ పంజాల భూపాల్, మాజీ సర్పంచ్ చుంచు రవి, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మైకెల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఖిలా వరంగల్: వరంగల్ 17వ డివిజన్ వసంతాపూర్ గ్రామంలో స్థానికులు, దాతల సహకారంతో నిర్మించనున్న సీతారామచంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి వేదపండితుల ఆధ్వర్యంలో గురువారం శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ గద్దె బాబు హాజరై నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో రాపెల్లి సాంబయ్య, ఊరుగొండ కుమార్, కత్తెరపల్లి దామోదర్, కడిదెల చంద్రమౌళి, గుండెకారి రామారావు, మొగిలి, మాటేటి ప్రభాకర్, బొజ్జ యాదగిరి, రవి, సురేష్, ఎల్లయ్య, రమేష్, వీరమల్లు, వెంకటేశ్వర్లు, నవీన్, కర్ణాకర్, భిక్షపతి, నరహరి, రాజేశ్వర్‌రావు, కృష్ణంరాజ్, రమేష్, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



మడికొండ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మడికొండలోని వడ్డెర కాలనీ వద్ద గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ గరీబ్‌నగర్‌కు చెందిన దున్నపోతుల సమ్మయ్య – రేణుక దంపతులు ద్విచక్ర వాహనంపై ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామంలో జరిగిన బంధువుల అంత్యక్రియలకు హాజరై తిరిగి వరంగల్‌కు వెళ్తున్నారు. ఈక్రమంలో మడికొండ వడ్డెరకాలనీ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిపోవడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

థైరాయిడ్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి

కాజీపేట: స్త్రీలు తరచుగా థైరాయిడ్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సీనియర్ ఫిజిషియన్ డాక్టర్ శ్రీలత సూచించారు. కాజీపేట పట్టణంలోని లతా వెంకట్ ఆర్థో అండ్ జనరల్ కేర్‌లో గురువారం ఉచిత థైరాయిడ్ పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ అధిక బరువు పెరుగుతుండడం, గొంతు వాపు, కీళ్లనొప్పులు, అధికంగా జుట్టురాలడం, చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉన్నవారు థైరాయిడ్ పరీక్ష చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటస్వామి, శశిరేఖ, కృష్ణవేణి, పల్లవి, సంపత్‌కుమార్, పున్నంచందర్, సుధాకర్, రాజ్‌కుమార్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అదుపులో ఇద్దరు ఆకతాయి బాలురు

ఖిలా వరంగల్: శంభునిపేట మసీదు వీధి రోడ్డుపై గురువారం రాత్రి ఇద్దరు బాలురు.. అటుగా వెళ్తున్న మహిళలపై ఈవ్‌టీజింగ్ పాల్పడ్డారు. మహిళలు ఎదురుతిరిగితే బెదిరింపులకు తెగపడ్డారు. దాన్ని గమనించిన స్థానికుడు మోరమధు.. ఓ బాలుడిని పట్టుకోగా, అతని చేతివేలును కొరికి పారిపోయాడు. ఈవ్‌టీజింగ్ పాల్పడిన ఇద్దరు బాలురపై మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అక్కడే సంచరిస్తున్న ఈవ్‌టీజర్లను పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు తెలిసింది. ఈవ్‌టీజింగ్‌ను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బైక్ అపహరణ

రామన్నపేట: ఇంటి ముందు నిలిపి ఉంచిన బైక్ అపహరణకు గురైన సంఘటన నగరంలోని మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చోటుచేసుకుంది. మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం కొత్తవాడకు చెందిన శ్రీరామ శ్రీనివాస్ ఏప్రిల్ 28న రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని రాత్రి తన ఇంటి ముందు పార్క్ చేసి మరునాడు ఉదయం చూసే వరకు అది కనిపించలేదు. ఎంత వెతికినా బైక్ దొరకకపోవడంతో బాధితుడు శ్రీరామ శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ గురువారం తెలిపారు.

మద్యం మత్తులో యువకుడి హల్‌చల్

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్‌లో ఓ ప్రైవేట్ బాలికల హాస్టల్ ఎదుట బుధవారం రాత్రి ఓ యువకుడు మద్యం మత్తులో హల్‌చల్ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తాగిన మత్తులో ఇష్టానుసారంగా వ్యవహరించాడు. హాస్టల్ ముందు మత్తులో ఆ యువకుడు చేసిన గొడవను ప్రశ్నించిన హాస్టల్ నిర్వాహకురాలు అరుణను అతడు ఇష్టం వచ్చినట్లు తిట్టాడు. దాంతో ఆమె హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌జీ తెలిపారు. యువకుడు శ్యాంపై కేసు నమోదు చేసి విచారించినట్లు సీఐ తెలిపారు.

మహిళపై దురుసుగా ప్రవర్తించిన ఏఎస్సై?

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని దీన్‌దయాళ్‌నగర్‌లో రెండు వర్గాల మధ్య బుధవారం జరిగిన గొడవపై విచారణకు వెళ్లిన సుబేదారి ఏఎస్సై.. విచారణ ముగించుకొని తిరిగివస్తున్న క్రమంలో ఓ మహిళపై దురుసుగా ప్రవర్తించి దుర్భాషలాడారని మహిళ తరఫు బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు సుబేదారి పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9505507575
9010299096 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
పి.చంద్రశేఖర్ (ACO) : 8074606274 (వరంగల్)
జి. రవియాదవ్ (ACO) : 9032782191 (హన్మకొండ)